క్లుప్తంగా

ఎల్ఓసీ అందజేత



టేకుమట్ల: మండలంలోని రామకిష్టాపూర్ (వి) గ్రామానికి చెందిన అల్లకొండ కొమురయ్య అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. దీంతో అతడికి ఆర్థిక సాయంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పందించి రూ.2.50లక్షల ఎల్ఓసీని మంజూరు చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు దొంతుల శ్రీనివాస్ బాధితుడి భార్యకు చెక్కు అందజేశారు.

వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

కాటారం: మహాముత్తారం మండలం యామన్‌పల్లికి చెందిన ఓ బాలికపై హత్యాచారయత్నానికి పాల్పడిన వృద్ధుడిపై పోక్సో కేసు నమోదైంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం యామన్‌పల్లికి చెందిన రత్నం రామయ్య ఈ నెల 15న అదే గ్రామానికి చెందిన ఓ బాలిక ఇంట్లో ఒంటరిగా ఉండటం గమనించి ఇంట్లోకి వెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలిక కేకలు వేయడంతో రామయ్య పారిపోయాడు. మూడు రోజులుగా మనోవ్యధకు గురైన బాలిక తల్లిదండ్రులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రామయ్యపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నాయకుడి మృతి



మాదవ్(ఫైల్)

టేకుమట్ల: మండలంలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు అక్కల మాదవ్ గురువారం మృతి చెందారు. మాదవ్ దశాబ్ద కాలానికి పైగా ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, మండలంలో ఉద్యమాలకు ఊతంనందించారు. మాదవ్ మృతిపై పట్ల ఎమ్మార్పీఎస్, ఏవైఎస్ నాయకులు సంతాపం ప్రకటించారు.

ఆర్థిక సాయం



ఏటూరునాగారం: మండలంలోని శంకరాజుపల్లికి చెందిన జనగాం రాజేష్ మంచిర్యాలలో ఎంబీబీఎస్ సీట్ సాధించాడు. కాగా, ఆర్థికమైన ఇబ్బందులు ఉండడంతో యువ నేతాజీ ఫౌండేషన్ ద్వారా ఫౌండేషన్ సభ్యుడు, వరంగల్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ గురువారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఖమ్మంకు చెందిన మురళి, సుగ్గాల నిఖిలతో కలిసి ఆర్థిక సాయంతో చేసినట్లు సమన్ తెలిపారు.

సన్మానం



వాజేడు: మండల పరిధిలోని ప్రగళ్లపల్లి పాఠశాలలో ఎనిమిది సంవత్సరాలుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు వాసం సుదేష్‌రావును అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. విద్యార్థులకు మంచి బోధన చేసి ఉన్నత స్థాయిలో నిలిచేలా తీర్చిదిద్దారని మొరుమూరు మాజీ సర్పంచ్ పూనం నరేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్ణ, రవి, ప్రసాద్, రాంబాబు, ఝాన్సీ రాణి, సూర్యనారాయణ, లక్ష్మణ్, నాగార్జున, నర్సయ్య, హిమామ్ ఉన్నారు.

మల్బరీ సాగుతో లాభాలు

- ప్రోత్సాహం ఇస్తున్న ప్రభుత్వం

చిట్యాల: మల్బరీ సాగుతో ఎంతో లాభాలు ఉన్నాయి. పట్టు పరిశ్రమ నిర్వహణ కోసం ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిల్క్ సమగ్ర పథకాన్ని అమలు చేసింది. సిల్క్ పథకం కింద అమలు చేసే ఈ పథకానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ రైతులకు రాయితీలను వేరు వేరుగా ప్రకటించింది. మండలంలోని 4 గ్రామాల్లో 16 ఎకరాల మల్బరీ సాగు అవుతుంది. మల్బరీ సాగు చేసినచో సంవత్సరానికి 7 నుంచి 9 పంటలు తీయవచ్చు. పట్టు గుళ్లకు మార్కెట్‌లో కేజీకి రూ.450 నుంచి రూ.500 వరకు ఉంది. ఒక్కసారి మల్బరీ సాగు నాటినచో 10 సంవత్సరాలు ఉంటుంది. ఆసక్తి ఉన్న రైతులు మల్బరీ సాగు చేసుకుని లాభాలు పొందవచ్చని అధికారులు తెలుపుతున్నారు.



మల్బరీ పంటను రైతుతో కలిసి పరిశీలిస్తున్న టెక్నికల్ ఆఫీసర్ దేవరాజు(ఫైల్)

సిల్క్ సమగ్ర పథకం ద్వారా రైతుకు రాయితీలు

వివరాలు	బీసీ అండ్ జనరల్	ఎస్సీ , ఎస్టీ
రెండు ఎకరాలలో మల్బరీ సాగు	రూ.60,000	రూ.78,000
నీటి సదుపాయానికి	రూ.50,000	రూ.65,000
పట్టు రేలింగ్ షేడ్ నిర్మాణం	రూ.2,25,000	రూ.2,95,500
పరికరాలకు(ట్రేలు, చంద్రికలు)	రూ.37,500	రూ.48,750
రోగ నిరోధక మందులకు	రూ.2500	రూ.3250
మొత్తం	రూ 3,75000	రూ.4,90,500

సద్వినియోగం చేసుకోవాలి



పట్టు పరిశ్రమను పోత్సహించేందుకు మల్బరీ పంటపై ప్రభుత్వం రాయితీలను ఏర్పాటు చేసింది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మల్బరీ పంటలతో అధిక లాభాలను పొందవచ్చు. మరిన్ని వివరాలకు 99664 35542 సెల్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

- బిల్ల దేవరాజు, టెక్నికల్ ఆఫీసర్ భూపాలపల్లి

ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదు కార్యక్రమంలో ఉపాధ్యాయులు

రేగొండ: వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు దుస్స సధాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు మండలంలోని రేపాక, మడతపల్లి, రంగయ్యపల్లి పాఠశాలల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్టీజోన్ వన్‌లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు పొందామంటే పీఆర్టీయూ ద్వారానే సాధ్యమైందన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు ఓటు హక్కును వినియోగించుకుని ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రంజాన్, మండల ప్రధాన కార్యదర్శి మధుకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సత్కురు రాజు, కృష్ణకుమారి, సూరం లక్ష్మీ, పోతర్ల సతీష్, ఉపాధ్యాయులు కోరి భిక్షపతి, సాంబశివుడు, శ్యాంసుందర్‌రెడ్డి, విజిత, వనిత, శివప్రసాద్, చరణ్‌కుమార్, విజయ్‌కుమార్, సంజీవరావు, సంధ్యారాణి, హరిత తదితరులు పాల్గొన్నారు.

స్నేహపూర్వక వాతావరణాన్ని కలిగించాలి



మాట్లాడుతున్న కొమురయ్య

ములుగు: బాలలకు స్నేహపూర్వక వాతావరణాన్ని ఏర్పరచడం మనందరి బాధ్యత అని మండల స్పెషల్ అధికారి కొమురయ్య అన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్-1098 ఆధ్వర్యంలో ఎంపీడీఓ రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన మండలస్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బాలలకు బంగారు భవిష్యత్తును అందించడం స్వేచ్ఛాయుతమైన వాతావరణాన్ని కల్పించాలని అన్నారు. గ్రామాల్లో, మండల స్థాయిలో నిస్సహాయ స్థితిలో ఉన్న బాలలకు తోడు ఉండేలా కమిటీ సమావేశంలో చర్చించాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో 1098/112పై విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ విజయ్‌భాస్కర్, బాలల పరిరక్షణ అధికారి ఓంకార్, ఎస్సై రామకృష్ణ, ఎంఓ ప్రేమ్‌సింగ్ ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



అరెస్టు చూపిస్తున్న పోలీసులు

రేగొండ: గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపల్లి క్రాస్ రోడ్డు వద్ద రేగొండ మండలంలోని జూబ్లీనగర్ గ్రామానికి చెందిన కనకం కల్యాణ్, హనుకొండ జిల్లా పరకాలకు చెందిన ముష్క రవితేజల వద్ద తనిఖీ చేయగా వారి వద్ద 300 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. కాగా, గంజాయిని ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరులో తక్కువ ధరకు కొనుక్కుని వచ్చి హనుమకొండలో విక్రయించేందుకు తీసుకువస్తున్నట్లు నిందితులు తెలిపినట్లు పేర్కొన్నారు. వారి నుంచి గంజాయి, స్కూటీ, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

ప్రభుత్వ కార్యాలయ భవనాలు నిర్మించాలి



మాట్లాడుతున్న మారెపెల్లి మల్లేశ్

టేకుమట్ల: మండల కేంద్రంలో తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల భవనాల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారిక భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు టెండర్లను పిలువలేదన్నారు. ప్రస్తుతం అరకొర వసతుల నడుమ కార్యాలయాలు కొనసాగుతుండడంతో అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వెంటనే టెండర్లను పిలిచి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కుమార్, రాంచందర్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కొత్తమల్లూరులో పరామర్శిస్తున్న నాగజ్యోతి

మంగపేట: మండలంలోని కొత్తమల్లూరు(బెస్తగూడెం)కు చెందిన బీఆర్ఎస్ మండల యూత్ నాయకుడు గుండారపు రమేష్ తల్లి నాగమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, జగదీశ్ దంపతులు గురువారం పరామర్శించారు. అలాగే తిమ్మంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ఎస్సీసెల్ మాజీ మండల అధ్యక్షుడు పూసాల నర్సింహారావు తల్లి ఇటీవల మృతి చెందగా పార్టీ నాయకులతో పరామర్శిమచి మృతురాలు చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. వారి వెంట బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, జిల్లా సీనియర్ నాయకుడు తుమ్మ మల్లారెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ వైస్ చైర్మన్ కాడ బోయిన నరేందర్, మండల నాయకులు చిట్టిమళ్ల సమ్మయ్య, చల్లగురుగుల తిరుపతి, నూతులకంటి ముకుందం, ఊడుగుల శ్రీనివాస్‌యాదవ్, యగ్గడి అర్జున్, ఏటూరునాగారం మాజీ సర్పంచ్ ఈసం రామ్మూర్తి, సోషల్‌మీడియా ఇన్‌చార్జ్ గుడివాడ శ్రీహరి తదితర నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఏటూరునాగారం: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ఎస్‌టీయూ అగ్రభాగం వహిస్తోందని ఎస్‌టీయూ మండల అధ్యక్షుడు వీరభద్రం అన్నారు. గురువారం మండలంలోని పలు పాఠశాలలో నూతనంగా విధుల్లో చేరిన టీచర్లకు ఎస్‌టీయూ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ.. బాల బాలికలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దగల మహోన్నతమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించి విధుల్లో చేరిన వారికి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులకు సంఘంలోకి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ రాంబాబు, పోతు రాజశేఖర్ పాల్గొన్నారు.

కొమురం భీమ్‌కు ఘన నివాళి



కాటారం: కొమురంభీమ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కాటారం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో గురువారం కొమురంభీమ్ వర్ధంతిని నిర్వహించారు. కొమురంభీమ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొమురంభీమ్ జీవిత చరిత్ర, ఆయన చేసిన పోరాటాల గూర్చి విద్యార్థులకు అధ్యాపకులు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లాలు, వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ మాధవి, డిప్యూటీ వార్డెన్ శ్రీనివాస్, వెంకటయ్య, రాజు, సమ్మక్క, హరిభూషన్, రామకృష్ణ, చారి, పీడి, పీఈటీలు మహేందర్, మంథెన శ్రీనివాస్, కోచ్ వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ములుగు/ములుగు రూరల్: జల్, జంగిల్, జమీన్ కోసం పోరాడిన పోరాటయోధుడు, గొండు బెబ్బులి కొమురంభీమ్ ఆశయాలను కొనసాగిద్దామని ఆదివాసీ ఉద్యోగ సంఘాల నాయకులు అన్నారు. భీమ్ వర్ధంతి సందర్భంగా జిల్లాకేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి పలువురు నాయకులు ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అటవీ మీద ఆదివాసీలకే హక్కు ఉందని అన్నారు. న్యాయంగా రావాల్సి పోడు పట్టాలను ఇవ్వకుండా కొంతమంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు మంకిడి రవి, డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య, విద్యుత్ శాఖ డీఈ పులుసం నాగేశ్వర్‌రావు, ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్, సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నవరం రవికాంత్, ఈక కుమారస్వామి, సోలం వెంకటేశ్వర్లు, నారాయణ, నర్సయ్య, భాస్కర్, సురేందర్, లక్కి అనిల్, హట్కర్ సమ్మయ్య, పోరిక సునీల్, గుల్లగట్టు సంజీవ, సారయ్య, వజ్జ రాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని మేడారంలోని సమ్మక్క-సారలమ్మ ఆదివాసీ మ్యూజియంలో కొమురంభీమ్ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మ్యూజియం అసిస్టెంట్ క్యూరేటర్ కుర్సం రవికుమార్ సిబ్బందితో కలిసి భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భీం ఆశయాలను ఆదివాసీలు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆలం సుధీర్, రవి పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో ఘనంగా కొమరం భీమ్ వర్ధంతిని ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పూనెం రామచందర్, సతీష్, చింత సోమరాజు, తాటి రాంబాబు, కనితి వెంకట కృష్ణ, జెజ్జెరి నారాయణమ్మ, గొంది రమాదేవి, ఇర్ప లక్ష్మి, సుదర్శన్, నర్సింహారావు తదితరులు ఉన్నారు.

మంగపేట: మండలం కేంద్రంలో కొరంభీం వర్ధంతిని ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కొమరంభీమ్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ మద్దెల అంజయ్య మాట్లాడుతూ.. కొమరంభీం ఉద్యమ ప్రస్థానాన్ని వివరిస్తు ఆశయ సాధనను నేటికి సాధించుకోలేక పోయామన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు పీసా చట్టం గ్రామసభల ద్వారనే తీర్మానం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు డబ్బుల ముత్యాలరావు, గిరిజన ప్రజా సంఘాల నాయకులు చాదమల్లయ్య, అయ్యోరియానయ్య, పీసా చట్టం మొబిలైజర్లతో పాటు తదితర నాయకులు పాల్గొన్నారు.



ములుగు: కొమురం భీమ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



వెంకటాపురం(కె): కొమరం భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



మంగపేటలో..

దోమల నివారణ మందు పిచికారీ



మందును పిచికారీ చేస్తున్న సిబ్బంది

కన్నాయిగూడెం: మండలంలోని చిట్యాల గ్రామంలో కన్నాయిగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి అభినవ్ ఆధ్వర్యంలో గురువారం రెండోవ విడత దోమల నివారణ మందును పిచికారీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్ మందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అభినవ్ మాట్లాడుతూ దోమలు వ్యాపించకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. దోమల భారీన పడకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వాజేడు: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



వెంకటాపురం(కె)లో..

వెంకటాపురం(కె): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి పవన్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆలుబాక, తిప్పాపురం, వెంకటాపురం, నూగూరు గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం వారి వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు స్నేహ, సొహెల్, అశిష్, సిబ్బంది జ్యోతి, మనోహర్, సత్యనారాయణ, తిరుపతి ఉన్నారు.

వాజేడు: మండల పరిధిలోని అరుణాచలపురం, ఘణపురం గ్రామాల్లో గురువారం మాతా శిశు సంరక్షణ వైద్యాధికారిని యోషిత ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. 46 మంది రోగులను పరీక్షించి మందులను అందజేశారు. బాలింతలు, గర్భిణులు, క్షయ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పరీక్షలు చేశారు. రక్త హీనతతో బాధపడుతున్న గర్భిణులను వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఒకరిని స్కానింగ్ నిమిత్తం ఏటూరునాగారం సివిల్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ కోటి రెడ్డి, అనూష, సత్య నాగవేని ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శికి తీవ్ర గాయాలు



గాయపడ్డ శీరిష్

గణపురం: మండలంలోని చెల్పూరు శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి బండారి శీరిష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. భూపాలపల్లి మండలం మోరంచపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శీరిష్ చెల్పూరు గ్రామంలో నివాసం ఉంటున్నాడు. గురువారం భూపాలపల్లిలో ఒక ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో చెల్పూరు శివారు కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం వద్దకు రాగానే ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొట్టుకుంది. ఈ ప్రమాదంలో శీరిష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌లోని ఒ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

గ్రంథాలయాలకు పుస్తకాల పంపిణీ



వెంకటాపురం(కె): పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ సత్యనారాయణ



కన్నాయిగూడెంలో..

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని గ్రంథాలయానికి 100 పుస్తకాలను బాల రక్షాభారత్ స్వచ్ఛంద సంస్థ, ఫ్యూర్ ప్లే వారి సహకారంతో గురువారం అందజేశారు. మండల విద్యాశాఖ అధికారి జీవీవీ సత్యనారాయణ చేతుల మదుగా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని తొమ్మిది పాఠశాలలకు లైబ్రరీ నిర్వహణ కోసం పుస్తకాలను అందజేశారు. సంస్థ నిర్వాహకులు శ్రీకాంత్, ఉపాధ్యాయులు బోల్లే శ్రీనివాస్, రాందేవ్, వెంకటేష్, భిక్షమణి, నాగమణి, రామకోటి తదితరులు ఉన్నారు.

కన్నాయిగూడెం: బాల రక్షా భారత్ స్వచ్ఛంద సంస్థ, ఫ్యూర్ ప్లే వారి ఆర్థిక సహకారంతో మండలంలోని గొర్రెవుల, ముప్పనపల్లి జెడ్పీ పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లోని లైబ్రరీ పుస్తకాలను పాఠశాల్లోని విద్యార్థులకు గురువారం పంపిణీ చేశారు. పుస్తకాలను అందించిన బాల రక్షా భారత్ స్వచ్ఛంద సంస్థ వారిని పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

వాజేడు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం బాల రక్షభారత్ స్వచ్ఛంద సంస్థ, ఫ్యూర్ ప్లే సంస్థ ఆర్థిక సాయంతో గ్రంథాలయ పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు ఆనందరావు, సంస్థ ప్రతినిధి శ్రీకాంత్, ఉపధ్యాయులు స్వరూప్ సింగ్, మల్లయ్య, ఆనంద్, శ్రీకాంత్, ప్రభాకర్, శ్రీరంగం, అమ్మాజీరాణి, వస్య ఉన్నారు.